
కథ 2000

3



# వలసపక్షి

పెద్దింటి అశోక్‌కుమార్

చలికాలం నీరెండ కాదది. ఎండాకాలం ఎండ, ఏడుగంటలకే చుర్రుమంటుంది. పైగా అది తారురోడ్డు. పక్కన చెట్లు కూడా లేవు. గొంగడి కొప్పెర తనపై వేసుకుని గాడిదల్ని తోలుకుంటూ నడుస్తున్నాడు సాయిలు. ఎప్పుడో అర్ధరాత్రి మొదలెట్టిన ప్రయాణం. విశ్రాంతి లేకుండా నడవడంతో కాళ్లు లాగుతున్నాయి.

గొంగడి కొప్పెరను సవరించుకుని పొద్దుకు అడ్డంగా చేయిపెట్టి ముందుకు పారజూశాడు సాయిలు. తను చేరవలసిన ఊరి ఆనవాలు కనిపించలేదు. దీర్ఘంగా నిట్టూర్చి గాడిదలను అదిలిస్తూ ముందుకు కదిలాడు.

అంతవరకూ నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుపై వాహనాల రద్దీ పెరిగిపోయింది. నెమ్మదిగా నడుస్తున్న గాడిదలు వాహనం వచ్చినప్పుడల్లా చెల్లాచెదురై మళ్లీ గుమిగూడి నడుస్తున్నాయి. అప్పుడప్పుడూ ఓండ్రు పెడుతూ పక్కకి పరుగు తీస్తున్న ఒకటి రెండు గాడిదల్ని నూలుపగ్గంతో అదిలిస్తూ గుంపులో కలుపుతున్నాడు. ఎదురుగా పత్తిలారీ ఒకటి రొదచేస్తూ రావటంతో పరుగెత్తుకెళ్లి ముందు నిలబడ్డాడు సాయిలు. గాడిదల్ని ఒకచోట ఆపి లారీ వెళ్లిపోయాక పక్కకు తప్పుకుని వాటిని అదిలించాడు. గాడిదలు తనవి కాదు కాబట్టి ఏదైనా ప్రమాదం జరిగితే నష్టం వేలల్లో చెల్లించాల్సి ఉంటుందని అతడి భయం. అందుకే జాగ్రత్తగా ప్రయాణం కొనసాగిస్తున్నాడు. అప్పుడప్పుడు కడుపులో కలుక్కుమని నొప్పివస్తుంది. భయం భయంగా పొట్టను నిమురుకుంటూ ప్రయాణం చేస్తున్నాడు.

అటువంటి ప్రయాణాలు సాయిలుకు కొత్త కాదు. సంవత్సరంలో రెండుసార్లు- వానాకాలం కోతలప్పుడు ఒకసారి, వేసవికాలం కోతలప్పుడు ఒకసారి గాడిదలను తోలుకుని ఆ ఊరు వెళ్తాడు. పదిహేను, నెలరోజులుండి కల్లాల వద్ద నుండి ఇండ్లకు వడ్లను జేరవేస్తాడు. పుట్టికి తూమెడు చొప్పున కిరాయి తీసుకుంటాడు. మిగిలిన రోజుల్లో ఇంటివద్ద కూలీపని చేసుకుంటాడు.

పది గాడిదలతో అలా జీవితం గడుపుతున్న సాయిలుకు రెండేళ్ల క్రితం కడుపులో తీవ్రంగా నొప్పి వచ్చింది. డాక్టర్ వద్దకు వెళ్తే ఆపరేషన్ చేయాలన్నాడు. సాయిలుకు భయం పట్టుకుంది. కొన్నిరోజులు మందులు వాడాడు. నొప్పి తగ్గలేదు. ఆపరేషన్ చేయించుకోక తప్పలేదు. డాక్టర్ బరువులు ఎత్తవద్దని చెప్పాడు. వడ్లను సంచుల్లోకి నింపి అమాంతంగా ఎత్తి గాడిదల మీద వేయాలి. బరువులు ఎత్తకూడదంటే ఎలా...? అని అడిగాడు డాక్టర్‌ని. అని చేస్తే మళ్లీ ఆపరేషన్ తప్పదని చెప్పాడు డాక్టర్.

సాయిలు గాడిదల్ని అమ్మేశాడు. వచ్చిన డబ్బులో సగం వైద్యానికే ఖర్చయిపోయింది. మిగిలిన కొద్దిపాటి డబ్బుతో ఏం చేయాలో తోచలేదు. మూడేళ్లకే రెట్టింపు ఇస్తానంటే తెలిసిన ఫైనాన్స్‌లో ఫిక్స్ చేశాడు. లాటరీల్లో నష్టపోయామని ఫైనాన్స్ వాళ్లు చేతులెత్తేశారు. జీవనోపాధికై చింతతోట, మామిడితోటల వద్ద కావలికి కుదిరాడు. సంవత్సరం అలా గడిచింది. తోటల్ని కొట్టేసి బొగ్గుబట్టీలు పెట్టారు. సాయిలు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

చేతిలో డబ్బులేదు. స్వంతంగా పొలం లేదు. కూతురు పెళ్లికి ఎదిగింది. కొడుకులిద్దరు బడికి వెళు

తున్నారు. ఖర్చులు ఎక్కువయ్యాయి. భార్య ఒక్కతే బీడీలు చేసి తెచ్చిన డబ్బు ఏ మూలకూ సరిపోయేది కాదు. అప్పులు చేయడం మొదలెట్టాడు సాయిలు. ఇక అప్పు పుట్టలేని పరిస్థితి వచ్చేసరికి ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. అప్పులవాళ్ల ఒత్తిడి అధికమయ్యింది. పూటగడవడం కష్టమయింది.

''కూసుండి తింటే గుట్టలు కూడా ఆగయి. ఒక్క దాన్ని చేస్తే నలుగురు తినుడాయె. యాడికెళ్లి అందు తది. దందల మన్నువడ దంద పెద్దదాయె. అడ్డెడు బియ్యం నీల్లల్లపొత్తే ఒక్క మెతుకు మిగలదాయె,'' అంటూ సాయిలు భార్య విసుక్కోడం మొదలెట్టింది. సాయిలు ఆలోచనలో పడ్డాడు. స్వంతంగా గాడిదలు లేవు. చేతుల మీద పనిలేదు. గాడిదలున్నప్పుడు ప్రతీ పంట మీద తిండిగింజలు పోగా రెండు మూడు వేల రూపాయల వరకూ జమచేసేవాడు. పై ఖర్చులకు వెనుక ముందు ఆడాల్సిన పరిస్థితి ఉండేది కాదు. బాధపడుతూనే కాలం గడుపుతున్నాడు సాయిలు.

రెండు రోజుల క్రితం సాయిలు హృదయాన్ని కదిలించే సంఘటన జరిగింది. ఇంట్లో బియ్యంతో సహా సరుకులన్నీ నిండుకున్నాయి. దుకాణంలోకి వెళ్తే ఉద్దెర ఇవ్వలేదు. బాకీపడిన డబ్బులు ఇవ్వాలని గొడవ చేశాడు. అవమానం అనిపించి తిరిగి వస్తూంటే అప్పుల వాళ్లు కూడబలుక్కున్నట్టు ఒక్కచోట కలిసి బాకీ ఎప్పుడు తీరుస్తావని నలుగురి ముందూ నిలదీశారు. అక్కడ పోగైన పెద్దలు సాయిలును నానా మాటల న్నారు. వారంరోజుల గడువు ఇచ్చారు. గడువు తర్వాత ఇంటికి తాళం వేస్తామని చెప్పారు.

ఉత్త చేతులతో ఇంటికి చేరుకుంటే భార్య ఈస డింపుగా చూసి పక్క ఇళ్లకు చేబదులుకు పోయింది. 'ప్రీతితోని పిచ్చకుంట్ల వాడిని చేసుకుంటే సచ్చేదాక చాపలు అల్లవెట్టండట. ఆ వంగలేనోడు నిన్ను సాదు తడా...?' అన్న మాటలు వినిపించాయి. ఎలాగో ఆ పూట గడిచింది. మరునాడు పొద్దంతా పస్తులే! భార్య ఎక్కడైనా చేబదులు తెచ్చి పిల్లలకు తనకు ఇంత ఉడకేస్తుందని ఎదురు చూసాడు సాయిలు.

పిల్లలు ఆకలితో అలమటిస్తుంటే భార్య ముడు చుకుని పడుకుంది. ఆమెను మొదట అడిగే ధైర్యం చేయలేదు. ఇక చేబదులుకు వెళ్లదని నిర్ధారించు కున్నాక, ''నా కొరకు కాదు, పిల్లల కొరకైనా ఏదో ఒకటి చెయ్యి,'' అని గొంతు పెకల్చుకుని అన్నాడు. ఆమె నాలుగు మాటలు తిట్టినా కొంత ఊరట కలిగేది. అలా అనలేదు. హృదయ విదారకంగా ఏడ్చి, ''అందరి వద్దా చేపోయి చేశాను. ఎవ్వరూ పుట్టనివ్వడం లేదు. పోచవ్వకు ఆపరేషన్ చేస్తే రక్తం కావాలన్నడట డాక్టరు. అలాగైనా రెండు పూటలు గడుస్తాయని రక్తం అమ్మ డానికి వెళ్తే నా రక్తం కలవదన్నాడు,'' అన్నది.

సాయిలుకు తల తిరిగిపోయింది. మొండి ధైర్యం వచ్చేసింది. దుమ్ము పట్టిన నూలుపగ్గాన్ని చేతి లోకి తీసుకున్నాడు. భార్యవైపు ఇక దిగులు పడవద్ద న్నట్టు చూసి బయటకు నడిచాడు. ఇరువై గాడిదల్ని నెలరోజుల వరకు కౌలు తీసుకున్నాడు. సంచుల్ని తయారుచేసుకున్నాడు. చిరిగిపోయిన సంచులకు టాకాలు వేసాడు.

'బరువులు ఎత్తితే నీ ఆరోగ్యం పాడవుతుంది. నువ్వు వెళ్లద్దు,' అని వారిస్తుందని చూశాడు సాయిలు. భార్య ఆ మాటే ఎత్తలేదు. ఇరుగు పొరుగువారితో ఈ విషయం సంతోషంతో చెప్పుకుంది. ఆమె ఆగిపొమ్మన గానే ఆగిపోయేవాడు కాదు. కానీ భార్య తన గురించి ఆలోచిస్తుందని తృప్తి ఉండేది. కాస్త తర్కించుకొని ఆలోచిస్తుంటే ఆమె ఎందుకు అలా అనలేదో బోధ పడింది.

ఈసారి కిరాయిలు పెంచి, రాత్రిపగలు అన కుండా వడ్లను జారవేసి, గాడిదల కౌలు పోను కొంత అప్పయినా తీర్చివేసి నలుగురిలో తలెత్తుకుని తిరగా లన్న దృఢసంకల్పంతో బయలుదేరాడు సాయిలు. అలా అతడు చేరాల్సిన ఊరిలోకి చేరుకునేసరికి తొమ్మిది దాటింది. ఎండ తన ప్రతాపాన్ని చూపడం మొదలెట్టింది. వానాకాలం కల్లాలు వచ్చేది అక్టోబర్, నవంబర్ నెలల్లో కాబట్టి అప్పుడు అంత కష్టంగా వుండదు. వేసవి కల్లాలు వచ్చేది ఏప్రిల్, మే నెలల్లో కాబట్టి ఎండలో వడ్లను జారవేయడం కష్టంగా వుంటుంది.

ఎల్లమ్మ గుడి దాటగానే ఊరకుక్కల బెడద మొదలయింది. గాడిదలకు అడ్డుపడి మొరుగు తున్నాయి. నూలుపగ్గంతో కుక్కల్ని పారదోలుతూ ముందుకు కదులుతున్నాడు సాయిలు. అతడు కప్పు కున్న గొంగడి చూసేవారిని అశ్చర్యంలో ముంచెత్తు తుంది. చలికాలమైతే ఫరవాలేదు. వెచ్చగా వుంటుంది. ఎండలో గొంగడి కప్పుకోవటమేమిటనుకుంటున్నారు. సాయిలుకు మాత్రం ఎండలో గొంగడి కొప్పెర హాయిగా చల్లగా ఉంది.

గాడిదల్ని ఊళ్లోకి కాకుండా పక్కనుండి వెళ్లే దారికి మళ్లిస్తూ ఎదురుగా వస్తున్న మల్లారెడ్డి వైపు చూసి, ''దండం పటేలా, బాగున్నవా... కోడలు దొర్సాని, చిన్న పటేలు, పెద్ద పటేలు అంతా బాగున్నరా!'' అంటూ అడిగాడు సాయిలు.

మల్లారెడ్డి ఈ ఊరిలో ఉన్న పెద్ద రైతుల్లో ఒకరు. కష్టపడి పనిచేస్తాడు. సాయిలును చూడగానే ఆప్యాయతగా పలకరించి అడిగాడు.

''ఏంరా సాయిలూ.. గాడిదలు ఎక్కువైనట్టున్నాయి. కొన్నావురా...?''

''కొనుడు ఎక్కడిది పటేలా! ఉన్నవే అమ్మిన. ఇవి కౌలుకు మాట్లాడుకచ్చిన''

''లండు గాడిదా! గట్ల అమ్ముకుంటావురా. గాడిదల్ని అమ్మి గాడిదలెక్క తిరుగుదమనుకున్నవా...? గందుకనే యాడాది రెండేండ్ల కొద్ది ఇటు దిక్కు రాలేదు. అయినా మీకు గూడా మాలెక్క కరంటు బాయిలుండె, పొలాలుండె. మీరెందుకు కైకలు జేస్తరు రా!'' బీడి తీసి అందిస్తూ అన్నాడు మల్లారెడ్డి.

బీడీ అందుకుని చెవిలో పెట్టుకున్నాడు సాయిలు. పటేలు ముందు బీడీ తాగాలన్నా అతడికి బిడియమే. ''పొలాలెక్కడియి పటేలా! పానం బాగా లేదు. కడుపుల గడ్డయితే ఆపరేషన్ చేసింండ్రు. గాడిదల్ని అమ్మి దవాఖానకే పెట్టిన,'' బాధగా చెప్పాడు సాయిలు.

అతడి మాటలు విని నొచ్చుకున్నాడు మల్లారెడ్డి. సాయిలు వైపు జాలిగా చూస్తూ అన్నాడు, ''అరే.. గట్లయిందారా...? రాయి అసుంటి మనిషివి. పూర్తిగా బక్కగైనవు... ఎట్లుండెటోనివి ఎట్లయినావుర!''

అప్పటికే గాడిదలు కనుమరుగైపోయాయి. మరి కొద్దిసేపు క్షేమ సమాచారాలు విచారించి ముందుకు కదిలాడు మల్లారెడ్డి. తనుకూడా ముందుకు కదులుతూ అడిగాడు సాయిలు.

''గాడిదల్ని మన కొట్టంలనే తోలుత పటేలా! ఎప్పుడైనా మీ కొట్టంలనే తోలుకుంటున్న గదా... మీ కడుపు సల్లగుండ. వత్తెపోతే ఇంత నీడనిస్తున్నరు''

సాయిలు వైపు విషాదంగా చూసాడు మల్లారెడ్డి. కొన్ని క్షణాలపాటు అతడి నోటివెంట మాట రాలేదు. గొంతు పెకల్చుకుని బాధగా చెప్పాడు. ''ఇంకెక్కడి కొట్టంరా సాయిలూ! రోడ్లు వెడల్పు చేస్తున్నారు కదా.. కొట్టాన్ని కూల్చి తారురోడ్డు వేశారు.''

సాయిలుకు కూడా బాధవేసింది. ఇప్పుడు గాడిదల్ని ఎక్కడ ఉంచాలో అర్థంకాలేదు. అతడు ఆలోచనల్లో ఉండగానే, ''నర్సయ్య కొట్టం ఉంది కదా! అక్కడ ఉండు,'' అంటూ వెళ్లిపోయాడు మల్లారెడ్డి. నర్సయ్య పేరు వినగానే దీర్ఘంగా నిట్టూర్చాడు సాయిలు. నర్సయ్య ఒకసారి ఘర్షణపడ్డాడు. తన ముందు వచ్చినవారిని కాకుండా తన వద్దనే జార వేయాలని పట్టుబట్టాడు. అప్పుడు ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. అప్పటి నుండి సాయిలుతో మాట్లాడ్డం మానేసాడు నర్సయ్య.

కొట్టంలో గాడిదల్ని తోలితే అతడు కోపగించుకుంటాడని తెలుసు. చేసేది లేక గాడిదలన్నింటిని అటువైపు మరల్చాడు సాయిలు. కాళ్లా కడుపు పట్టుకుని ఎలాగో బ్రతిమాలాలనుకున్నాడు. సంవత్సరాల నుండి అదే ఊరు రావడంతో అతడికి అందరూ పరిచయమే. పైగా సాయలు కలుపుగోలు మనిషి, ఎదురు పడిన వారినల్లా పలకరిస్తూ నర్సయ్య కొట్టం చేరుకుని, అందులో గాడిదల్ని తోలి పనుగడివేశాడు.

కడుపులో ఆకలి మొదలయింది. ఎప్పుడు వచ్చినా, వెంట సద్దిమూట తెచ్చుకునేవాడు. ఈసారి తేలేదు. ఎవరైనా గిరాకీ వస్తే ముందుగా భోజనం పెట్టుమనాలనుకున్నాడు. కొట్టం ముందున్న చింతచెట్టు కిందకి వెళ్లి గొంగడి పరుచుకుని పడుకున్నాడు. గాడిదలు కొట్టంలో ఓండ్రు పెడుతూ పరుగులు తీస్తున్నాయి. రెండేళ్ల తర్వాత వచ్చాడు కాబట్టి ఆ వాతావరణం కొత్తగా అనిపిస్తుంది సాయిలుకు. మొదటిసారి... దాదాపు పదిహేనేళ్ల క్రితం గాడిదలతో ఆ ఊరిలోకి అడుగుపెట్టిన రోజు గుర్తుకు వచ్చింది. అప్పుడు ఆ ఊరే కాదు. వృత్తి కూడా కొత్తే! గాడిదలు కూడా కొత్తే! వాటిని కొనుక్కున్న మరునాడే ఆ ఊళ్లోకి ప్రవేశించాడు.

అంతకు ముందైతే సాయిలు ఆవులను కాసేవాడు. తండ్రి అదేపని చేయడంతో చిన్నప్పటి నుండి ఆవుల వెంటనే తండ్రితో వెళ్లేవాడు. తండ్రి మరణంతో ఆ పని సాయిలుపైబడింది. రైతులందరికీ నమ్మకస్తుడుగా ఉండడంతో కాపరిగా సాయిలునే నియమించారు. జీతం కూడా పెంచారు. కొన్నిరోజులు బాగానే నడిచింది. కాల గమనంలో ఆవుల సంతతి క్షీణించడం మొదలెట్టింది. రైతులకు పశువుల మీద శ్రద్ధ తగ్గింది. వందల్లో ఉన్న సంఖ్య పదుల్లోకి మారింది. కొన్ని రోజుల తర్వాత ఆ సంఖ్య ఇంకా పూర్తిగా తగ్గింది. ఉన్నవి కూడా రేపోమాపో అమ్మేట్టు ఉండంతో పనిలో నుండి తప్పుకున్నాడు సాయిలు.

ఆవుల సంఖ్య తగ్గి బర్ల సంఖ్య పెరిగింది. ఇంతకుముందు బర్లను కాసే వ్యక్తిని తీసేసి సాయిలుకే

వాటిని అప్పగిస్తామన్నారు రైతులు. అతడి పొట్టమీద కొట్టుడెందుకు! నేను వేరే పనిని చూసుకుంటాను అని సాయిలు గాడిదల్ని కొనుక్కున్నాడు. పశువులపై ఉండే అభిమానం చేతనే ఆ వృత్తిని చేపట్టాడు. పైగా లాభసాటి వృత్తి. పని ఎక్కువ రోజులుండదు.

ఆ ఊరిలోకి అడుగుపెట్టిన సంవత్సరం కాలం బాగా అయింది. అంతకు ముందు గాడిదల మీద ధాన్యం జారవేయడం తెలియదు వారికి. నెత్తిమోత, ఎడ్లబండ్లు, రెండే పద్ధతులు తెలుసు. అక్కడక్కడ చూశారు కానీ గాడిద ఆ ఊరిలోకి అడుగుపెట్టలేదు. సాయిలుకు మంచి గిరాకీ తగిలింది. రెండుమూడు రోజులవరకూ రైతులెవరూ రాకపోయినా, ఆ తర్వాత క్యూ కట్టారు. నాది ముందటే నాది ముందని పోట్లాడు కునేవారు. గాడిదలపై ధాన్యం జారవేయడమంటే అదొక పెద్దరికంలా భావించేవారు. సాయిలు వద్ద గాడిదలు నాలుగు నుండి పదికి పెరిగాయి.

అప్పటి నుండి రెండేళ్ల క్రితం వరకూ క్రమం తప్పకుండా వచ్చాడు. ఎప్పుడూ ఖాళీ కడుపుతో వట్టి చేతులతో వెళ్లలేదు. ఒక్కోసారి ధాన్యం బాగా జమచేసి అదే ఊరిలో అమ్మి డబ్బుల్ని తీసుకెళ్లేవాడు. తన ఈడు వాళ్లను వరుసలు పెట్టి పిలుస్తూ ఆ ఊరిలో ఒక వ్యక్తిగా కలిసిపోయాడు. పెద్ద కులస్తులను దొరా, దొర్సానీ అని పిలిచేవాడు.

సూర్యుడు నడినెత్తి పైకి వచ్చాడు. చింతచెట్టు నీడ మరింతగా కుదించుకుపోయింది. గొంగడిని చెట్టు మొదలు వైపు జరుపుకుని మళ్లీ నడుం వాల్చాడు సాయిలు. ఆకలి మరింత అధికమైంది. ఒక్కరు గూడా గాడిదల కొరకు వస్తున్న జాడ కనిపించలేదు.

కాలం గడుస్తున్న కొలదీ సాయిలులో ఆశ్చర్యం, ఆందోళన పెరిగిపోతుంది. అంతకు ముందైతే గాడిదలు అరుపులు వినగానే జనం పరుగెత్తుకొచ్చేవారు. తనను హడావుడి చేసేవారు ఇన్నిరోజులు లేటుగా ఎందుకొచ్చా వని తిట్టేవారు. కాలం బాగానే అయింది. పంటలు బాగానే పండాయి. మరి ధాన్యం జారవేయడానికి రైతులు ఎందుకు రావడంలేదు...? ఇది కోతల దినమే! ఇలా ఎందుకు జరిగింది. తనువచ్చి ఇంతసేపైనా రైతుల్లో కదలిక లేదంటే...? ఈ పాటికి గాడిదల అరుపులు అందరికీ వినిపించే ఉంటాయి కదా!

మనసు ఏదో కీడును శంకిస్తుంది. దిగులుగా లేచి కూర్చున్నాడు సాయిలు. అప్పుడే రోడ్డు మీది నుండి ఒక ట్రాక్టర్ పెద్దగా శబ్దం చేస్తూ వెళ్లింది. కళ్లు నులుము కుంటూ లేచి నిలబడ్డాడు సాయిలు. ఆ దుమ్ములో మసక మసగ్గా కనిపించింది గంగమణి. భర్త మస్కట్ వెళ్లాడు. ఇద్దరు జీతగాళ్లతో వ్యవసాయం నడిపిస్తుంది. మనిషిది భారీ గుణం. ఆపదలో ఉన్న మనిషికి అడిగినా అడక్కపోయినా తనవంతు సహాయాన్ని అందిస్తుంది.

సాయిలుకు ప్రాణం లేచి వచ్చింది. గంగమణి ఖచ్చితంగా గాడిదల కొరకు వస్తుందని అతడి నమ్మకం. ఎందుకంటే గంగమణి పొలాలు ఇటువైపు లేవు. అందుకే గాడిదల కొరకు తప్ప ఇటువైపురాదు. ఆవిడ కల్లాలు అంటే రెండురోజులపని. ఎలాగైనా బ్రతిమాలి తన పరిస్థితినంతా చెప్పి వడ్లు ఎక్కువ అడుక్కోవాలి. ఆలస్యం అయినా సరే! మంచి బోణీ దొరికింది. అనుకుంటూ గొంగడి దులిపి భుజాన వేసుకున్నాడు సాయిలు వెళ్లడానికి సిద్ధపడుతూ.

గంగమణి అక్కడ ఆగలేదు వినవిసా సాయిలును దాటి వెళ్లిపోయింది. కొన్ని క్షణాలు షాక్‌కు గురి అయినట్లుగా చూస్తుండిపోయాడు సాయిలు. అతి కష్టం మీద గొంతు పెకల్చుకుని

''యాడికి పోతున్నవు దొర్సానీ. కల్లాలు లేచి నయా!? పటేలు మస్కట్ నుండి వచ్చిండా...?'' అన్నాడు.

గంగమణి క్షణకాలం ఆగి వెనక్కితిరిగి చూసింది. సాయిలును గుర్తుపట్టగానే వెనక్కి తిరిగివచ్చి మరోసారి పరిశీలనగా చూసి అడిగింది. ''అరే... నువ్వేనారా సాయిలు! నేను ఎవ్వలో అనుకుంటున్న. పూర్తిగ గిట్లయిపోయినవేందిరా...? పాణం బాగలేదా ఏందీ!''

సాయిలు ఆమె ముందుకు వచ్చి నిలబడి చెప్పాడు. ''అవును దొర్సాని! కడుపుల కంకెడు కంకెడు గడ్డలయినయి. ఆపరేషన్ జేసిండ్రు. గందుకనే రెండేండ్ల కొద్దీ రాలేదు. కల్లాలు లేచినయా''

''యాడ లేచినయిరా! వడ్లు కల్లం మీదే వున్నాయి. ఎగబోసి రాశి జేసినం..'' గంగమణి మాటలు పూర్తి కానేలేదు. ఆతృతగా అడిగాడు సాయిలు.

''అట్లయితే గాడిదల్ని తోలుకత్త. మీరు ఇంకో కుప్పగొట్టి రాశిజేసేవరకు ఇవి జారగొడుత.''

అతడి మొహంలోని దీనత్వం, బతిమాలు తున్నట్టు అడిగే తీరు గంగమణి హృదయాన్ని కలచి వేసింది. బాధగా చెప్పింది. ''కుప్పలు కొట్టుడు ఎక్కడి దిరా సాయిలూ! పని తీరదని చేనంతా కోసి పడుగు పెట్టి ట్రాక్టర్‌తో తొక్కిచ్చిన. ఇంట్ల తీసికుపోయి పోసు డెందుకని కల్లం మీదనే కోమటాయనకు అమ్మిన.

కల్లంలనే కాంట పెట్టి జోక్కుండు. గా సేటు జాడలనే పోతున్న.''

సాయిలు మొహం వికసించింది. కళ్లు ఆనందం తో కాంతివంతమయ్యాయి. ''అట్లయితే నయ్యమే నాయె! పొద్దంతా పని దొరుకుతది. వడ్లన్నీ కోమటిసేటు ఇంటికే జారగొడుత. జరంత కిరాయి ఎక్కువైతది గంతే!'' గొంగడిని భుజంపై సవరించుకుంటూ అన్నాడు సాయిలు.

''వద్దురా! సేటు ట్రాక్టరు మీదనే తీసుకపోతడట. ఇక్కడి నుండి సక్కగ రైస్‌మిల్లుకే తీసుకపోతడట. ఇయ్యాల్ల మా ఇంట్ల కొత్త. ఎప్పుడు తిన్నవో ఏమో! ఇంటికాడ కోడలున్నది. పోయి తిను. రాత్రికి కూడా ఇంటికే వచ్చి తిను,'' మరింత బాధగా చెప్పింది గంగమణి.

సాయిలు మొహం వాడిపోయింది. బాధగా నిట్టూరుస్తూ, ''అట్లనే దొర్సానీ,'' అన్నాడు. అతడి గొంతులోని నైరాశ్యాన్ని స్పష్టంగా గుర్తుపట్టినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో అక్కడి నుండి కదిలింది గంగమణి.

సాయిలుకు ఆకలిగా ఉన్నా తినాలని లేదు. ఇంతకు ముందైతే రైతులు తన రాక కొరకు ఎదురు చూసేవారు. చాటుగా పిలిచి కల్లుకు వడ్లు పెడుతానని ఆశ చూపి వెనుక వచ్చినవారు ముందుగా పట్టుకెళ్లే వారు. ఒక్కొక్కప్పుడు తిండి తినడానికి కూడా తీరిక ఉండేది కాదు. కూరుకు రాత్రి వరకూ జారవేసినా వడ్లు పూర్తయ్యేవి కావు.

ఎండ తాపం మరీ ఎక్కువైంది. చూసస్తూ కూర్చుంటే లాభం లేదని గ్రహించాడు. అతడి కళ్లల్లో దుమ్ము కొడుతూ మరో ట్రాక్టర్ వడ్ల సంచులను నింపు కుని వెళ్లిపోయింది. గొంగడిని కొప్పెరగా మలిచి నెత్తి మీద పెట్టుకుని రోడ్డును దాటి చెరువుకట్ట ఎక్కాడు సాయిలు.

వందల ఎకరాల విస్తీర్ణంలో బంగారు పలకల్ని పరిచినట్లు పంటచేలు. అప్పుడప్పుడూ మందంగా వీచిన గాలికి అలల్లా కదులుతూ ఆహ్వానం పలుకు తున్నట్లున్నాయి. ఒకచోట కోతలు కోస్తూ, మరొకచోట మెదలను మోస్తూ మనుషులు హడావుడిగా కదులు తున్నారు. సాయిలు కళ్లకు అవేవీ ఆనడంలేదు. తూర్పారబట్టి వడ్లరాశి చేసిన కల్లంకొరకు వెదుకు తున్నాడు. అలాంటి కల్లం కినిస్తే కాళ్లావేళ్లా పడి కిరాయి సంపాదించవచ్చునని అతడి ఆశ.

అడుగు తీసి అడుగు వేయాలంటే నీరసంగా ఉంది. కడుపులో ఆకలి కాస్తా నొప్పిగా మారింది. దాహంతో నాలిక పిడుచుకగట్టుకుపోయింది. శక్తినంతా కూడదీసుకుని నడుస్తున్నాడు సాయిలు. ఒక్కరైనా కిరాయి చెప్పకపోతారా! అన్న ఆశనే అతడిని ముందుకు నడిపిస్తుంది. అడుగులో అడుగులో వేస్తూ ఒకచోట ఆగిపోయాడు సాయిలు.

అక్కడ కల్లంలో ట్రాక్టర్ తిరుగుతుంది. కోసిన వరిని కల్లంలో పరిచి దానిమీద ట్రాక్టర్‌ను గుండ్రంగా తిప్పుతున్నారు. ఇంతకుముందైతే వరిని కోసి, రెండు రోజులు ఆరేలా ఉంచి చిన్నచిన్న కట్టలు కట్టి కుప్ప పేర్చేవారు. కుండపోత వర్షం పడినా ఒక్కచుక్క కుప్ప లోనికి దిగేది కాదు. పైన బంగారు గొలుసులు కట్టినట్లు చూడముచ్చటగా ఉండేది. రెండు మూడు రోజులు కుప్పను అలాగే ఉంచి, ఒక్కొక్క కట్టతీసి కొడుతూ, కొట్టిన కట్టల్ని సరికుప్ప పేర్చేవారు.

వడ్లను ఎగబోసి రాశిచేసి బూడిదఎత్తి చుట్టేవారు. రాశిని కళ్లనిండా తృప్తిగా చూసుకున్నాకే కొబ్బరి కాయ కొట్టి బుడ్డితో కొలుస్తూ గాడిదల మీద ఇంటికి జార వేసేవారు. వరికుప్పను మరోనాడు ఎడ్లను బంతి కట్టి తొక్కించేవారు. సాయిలుకు అలా చేస్తున్న దాఖలాలు ఎక్కడా కనిపించలేదు. జీవితంలో యాంత్రికత చోటు చేసుకుని స్పీడ్ పెరిగిపోయినట్టే వ్యవసాయంలో కూడా యంత్రాలు చోటు చేసుకుని స్పీడ్ పెరిగిపో యింది.

చెరువుకట్టపై నుండి క్రిందికి దిగి మత్తడిని దాటి ఒడ్ల వెంట నడవడం మొదలెట్టాడు సాయిలు. ఒకచోట అతడి కాళ్లకు బ్రేకులు పడ్డాయి. ఆకలితో ఉన్నవాడికి పరమాన్న భోజనంలా ఒక కల్లం కనిపించింది. అది సాకలి శంకరి కల్లం. వడ్లను ఎగబోసి రాశిచేశారు. కొండంత ఆశతో అటువైపు నడిచాడు. కల్లంలో శంకరి తప్ప ఎవరూలేరు. సాయిలును చూసి ముందుగా గుర్తు పట్టలేదు. గుర్తుపట్టాక నవ్వుతూ అన్నాడు.

''ఒరే... సాయిలూ! నువ్వారా... నేను ఎవలో అనుకున్న. ఏందిరా గిట్ల ఊగులాడుకుంట వత్తున్నవు? నీ గాడిదలెవ్వి...? పల్లె పటేలోలె వత్తున్నవ్ ఫో!''

సాయిలు అతడిని సమీపించి, ఎదురుగా గొంగడి వేసుకుని కూర్చుంటూ చెప్పాడు. ''ఉన్నాయన్నా కొట్టంల తోలిన. ఇంతకుముందే వచ్చిన. ఇటుదిక్కు ఏమన్నా కల్లాలు ఉన్నవేమోనని వచ్చిన.''

''అయినా ఇప్పుడు గాడుదలకు ఎవడూ పోసే టట్టులేడురా! అందరు కల్లంమీదనే అమ్ముతున్నరు. అలుకగ ఉంటదని సేటు ఇటు నుండి ఇటే రైస్

మిల్లుకు కొడుతుండు. రెండు రోజులు ఆలిసమైనా ఆగుతున్నరుగనీ వడ్లను ఇండ్లల్లకు కొంటబోతలేరు. తిండికి కూడా వడ్లు ఇంటికి తీసుకుపోతలేరంటే నమ్ముర! సేటు దగ్గరి నుండే రెండు సంచుల బియ్యం తెచ్చుకుని తింటుండ్రు,'' నెమ్మదిగా చెప్పాడు శంకరి.

అతడి మాటలకు సాయిలు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అప్పు, భార్యపడే అవస్థలు, పెళ్లీడుకొచ్చిన కూతురు.. గుర్తొచ్చారు. పైకి మాత్రం గంభీరంగా అడిగాడు. ''మరి నువ్వెట్ల జారగొడుతున్నవన్నా! టాక్టర్‌తో నేనా...?''

అతడి మాటలకు చిన్నగా నవ్వి చెప్పాడు శంకరి. ''గట్లనే అనుకో. వడ్లను అమ్మలేదు. ఇంట్లనే గరిశెగట్టిన. అండ్లపోసి ఉంచుత. లేవీగల్ల అయిపోయినంక దర పెరుగుతది గదా! అప్పుడు అమ్ముత''

సాయిలులో ఆశ చివురించింది. వడ్లు అమ్మలేదు కాబట్టి ఎలాగైనా ఒప్పించి గాడిదలపై జారవేయాలని నిశ్చయించుకున్నాడు. దీనంగా మొహం పెట్టి బ్రతిమాలుతున్న ధోరణిలో అన్నాడు సాయిలు ''పొద్దటి నుండి ఒక్క గిరాకీ లేదన్నా! ప్రాణం బాగాలేక గాడిదల్ని అమ్ముకున్న. ఇప్పుడు కౌలుకు దెచ్చుకున్న. గిరాకీ వచ్చినా రాకున్నా కౌలు ఇయ్యాల్సిందే! ఎట్లనన్న జేసి నాకు కిరాయి జెప్పు. నీకు పుణ్యం ఉంటుంది.''

శంకరి అతడి వైపు ఈసడింపుగా చూస్తూ అన్నాడు. ''ఒరే సాయిలూ! పెడుతననంటె ఆశ ఉంటది. కొడుతననంటె భయముంటది. నీకు ఇస్తనని ఇయ్యపోతే బాధ. పెద్ద పెద్ద బస్తాలల్ల నింపి ట్రాక్టర్ మీద తీసుకపోత. ఆ బస్తాలను అట్లనే ఇంటి దగ్గర నెట్టు వేస్త, అమ్మాలనుకున్నప్పుడు అట్లనే కాంటకు వస్త. బస్తాలు విప్పుడుండది, నింపుడుండది. పని అలుకగ అయిపోతది. నీ గాడుదుల మీద జారగొడితే ఇడుసుడు నింపుడు, అదొక తంటా!''

నిరాశగా నిట్టూరుస్తూ లేచాడు సాయిలు. శంకరి అతడిని వారించలేదు. అంత తొందరగా వదులు తాడనుకోలేదతడు. సాయిలు కూడా అంత తొందరగా వదలకూడదనుకున్నాడు కానీ- అతడంత కచ్చితంగా చెప్పేసరికి ఇక లాభం లేదనుకుని కాళ్లీడ్చుకుంటూ ముందుకు కదిలాడు. ఇంతకుముందు గాడిదల వెంట అతడు వెళ్తుంటే కనీసం ఇద్దరు ముగ్గురు రైతులన్నా వెంట ఉండేవారు. అవకాశం రాగానే తోలుకొని వెళ్లడానికి. ఇప్పుడు కావాలని వెళ్లినా ఈసడించుకుంటున్నారు.

ఒడ్ల వెంట నడుస్తూ మలుపు తిరిగి కాలువ గట్టు నెక్కాడు సాయిలు. అప్పటికే నడినెత్తిన సూర్యుడు కొద్దిగా వంగాడు. సాయిలు మెదడులో రకరకాల ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. అప్పటి రైతులంతా ఏమయ్యారు? అందరూ ధాన్యాన్ని అమ్మరు. కొందరైనా నిల్వ చేస్తారు. ఆ కొందరిలో కొందరు ట్రాక్టర్‌ను వాడినా కొద్దిపాటి పంట పండే రైతులు కూడా ఉంటారు. వారి ధాన్యం ట్రాక్టర్ నిండదు. వారెలా జారవేస్తున్నారు...? ఇప్పుడు కొట్టం వద్దకు ఎవరైనా వచ్చి ఉంటారా...? వెంటనే వెళ్తే తప్ప, గిరాకీ లేదంటే నమ్మరు గాడిదల్ని కౌలుకిచ్చినవారు. ఇప్పుడెలా...? కందిరీగల్లా చుట్టుముట్టిన ఆలోచనలతో సతమతమౌతూ నడుస్తున్న సాయిలుకు పిలుపు వినిపించి వెనక్కి తిరిగి చూశాడు.

ఆలోచనల్లో పడి గమనించలేదు కానీ చాలా దూరం వచ్చినట్లు గుర్తించాడు. ఇస్తారి తన పేరు పెట్టి పిలుస్తున్నాడు. మామిడిచెట్టు కింద కల్లం, కల్లంలో వడ్లరాశి ఉంది. సాయిలులో మళ్లీ ఆశ చివురించింది. గబగబా అటువైపు నడిచాడు. ఇస్తారి ఎటువంటివాడో సాయిలుకు తెలుసు. మాట మీద నిలకడ ఉండదు. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లని వాదిస్తాడు. ఎలాగైతేనేం! ఊరికే పిలువడు గదా అని వెళ్లాడు. క్షేమ సమాచారాలు, ఆ మాట ఈ మాట తర్వాత మెల్లిగా అడిగాడు సాయిలు.

''ఊర్లె టాక్టర్లు అయినయి. కల్లంలకు వచ్చి పోసుకపోతున్నయి. మమ్మల్ని యాడ కానుతరు. అవ్వి రానప్పుడుండె సాయిలుతోని పని. కల్లుపోత్తనని, బువ్వ పెడుతనని బుదురకిత్తురు. అందరికీ మస్కగొట్టి ఎన్ని సార్లు నీ వడ్లను జారగొట్టలేదు! ఇప్పుడన్నా దగ్గరికి రానిత్తవా లేదా...?''

అతడి మాటలకు చిన్నగా నవ్వి కొత్తకుండల నీళ్లను తీసుకుని తాగి నెమ్మదిగా చెప్పాడు ఇస్తారి. ''కాలం మారుతుందిరా. మనం కూడా మారాలి. మెద మోసి కప్పవేసి కొట్టి గడ్డి తొక్కిచ్చుడుకు మునుపు ఎకురానికి పదిహేనుమంది కూలీలు పడుదురు. ఇప్పుడు కుప్పలు పెట్టుడు లేదు. రాశి చేసుడు లేదు. పడుగు పెట్టి తొక్కిస్తే ఎకురానికి ఆరేడుమంది కూలీలైతే సాలయితుంది. ఎంత లాభమో చెప్పు. నీ గాడుదల మోత గూడా అంతేరా! పుట్టెడు వడ్లకు తూమెడు తీసుకుంటావు. ఏడుపుట్లకు ఏడు తూములు. అదే ట్రాక్టర్‌కు అయితే అందులో సగం వడ్లు చాలు. పైగా గంట రెండు గంటల్లో పని పూర్తయితుంది. నువ్వు నూరు

జెప్పురా సాయిలూ... మనుషులు పని అలుకగ అయే టట్లు చూసుకుంటరు... అదీ తక్కువ ఖర్చుతో.''

కాసేపు మాటల తర్వాత తన పరిస్థితి మరోసారి చెప్పుకుని బ్రతిమాలడం మొదలెట్టాడు సాయిలు. ముందుగా ఒప్పుకోలే ఇస్తారి. చివరకు ట్రాక్టర్‌కి ఇచ్చే కిరాయికి ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. కిరాయి పెంచుదామని వచ్చిన సాయిలుకు అందులో సగం తగ్గేసరికి బాధేసింది. ఆ లెక్క చొప్పున గాడిదల కౌలు కూడా తీరదు. ఎలాగైనా సరే అని ఒప్పుకుని లేచాడు. కుండల నీళ్లతో కడుపు నింపుకుని వడివడిగా అడుగులు వేస్తూ కొట్టంను చేరుకున్నాడు.

గాడిదల్ని తోలుకుని ఇస్తారి కల్లం చేసుకునేసరికి పొద్దు మరింత వంగింది. అక్కడ ఇస్తారి కనిపించలేదు. అతడి భార్య కల్లం అడుగుల్ని చీపురుతో ఊడుస్తూ కనిపించింది. గాడిదల్ని ఒక్కచోట గుంపు చేసి సంచుల్ని భుజం మీద వేసుకుని ఆమెను సమీపించాడు సాయిలు. తలెత్తి ఒకసారి ఉరిమినట్టుగా అతడివైపు చూసి తిట్ల దండకం మొదలెట్టిందామె.

సాయిలు మనస్సు చివుక్కుమంది. బాధను దిగమింగుకుంటూ ''బావ ఎటుపోయిండక్కా... గాడిదల్ని తెమ్మన్నడు. బుడ్డి తేనుపోయిండా...?'' అన్నాడు ఆమెతో.

చీపురుకట్టను నేలకు విసిరికొట్టి లేచి నిలబడి అరిచినట్టుగ అన్నది ఇస్తారి భార్య. ''నీ బావ తలపండు వలుగ. ఏం మావులజేత్తనని గాడుదల తెమ్మన్నడు. దొడ్లె ఎడ్లున్నయి. సైరమీద బండి ఉన్నది. జారగొడితే నాలుగు మలుకలు గావు. వంగలేక నిన్ను రమ్మన్నడా... ఎర్రటి ఎండల కైకిలు పెట్టకుండ చేసి యాల్లకు వచ్చి నంక తూములకు తూముల మంది బొందల మీద పోసుడు. పుట్టుకల మన్నువడ మనిషి పుట్టుక పుట్టినంత జరంత రేషం ఉండాలె.''

సాయిలు మౌనంగా నిలబడిపోయాడు. ఇస్తారి భార్య గొంతు ఏమాత్రం తగ్గించకుండా అరుస్తూనే చీపురు అందుకుని తన పనిలో మునిగిపోయింది. చాలాసేపు అలాగే నిలబడ్డాడు సాయిలు. ఆమె తిట్టిన తిట్టు తిట్టకుండా భర్తను తిడుతూనే ఉంది. గాడిదలు చెల్లాచెదురై వరికుప్పలున్న చోటికి వెళ్తున్నాయి.

''ఇగ వద్దంటవా అక్కా...'' గొంతు పెకల్చుకుని అడిగాడు సాయిలు. అతడికి చెప్పలేనంత బాధగా వుంది. చేస్తున్న పనిని ఆపకుండా, కనీసం తల కూడా ఎత్తకుండా అన్నది ఆమె.

''నాకేం ఎరుక. నేను గిట్ల రమ్మన్ననా... నిన్ను ఎవ్వలు రమ్మన్నరో వాల్లనే అడుగు. నీకు కిరాయి యాడికెళ్లి ఇత్తడో ఇయ్యని, ఏం ఏర్పడుతుంది తాత కొడుక్కు. ఉనుకమీది రోకలిలెక్క ఆడుతున్నడు.''

ఆమెను బ్రతిమాలి లాభం లేదనుకున్నాడు. నిరాశగా వెనుదిరిగాడు. గాడుదులన్నింటిని ఏకం చేసి ఇంకెవరైనా పిలుస్తారేమోనని చూశాడు. ఎవరి నుండి పిలుపు రాలేదు. గాడిదలు ఒకచోట ఉండడం లేదు. పొలాల్లో పడి మేస్తే రైతులతో తిట్లు. అందుకే గాడిదలతో కొట్టంను చేరుకున్నాడు.

సాయిలుకు ఆశ పూర్తిగా చావలేదు. అతడి దృష్టి వాగుకు అవతల ఉన్న పొలాలపై పండింది. వాగులో ట్రాక్టర్ నడవదు. బండ్లు కూడా సరిగా నడవవు. అటు వెళ్తే కిరాయిలు దొరుకుతుండవచ్చుననిపించింది. వెంటనే అటువైపు నడిచాడు సాయిలు. ఇంతకు ముందైతే దూరంగా ఉంటాయని వాగవతలి పొలాల్లోంచి వడ్లు జారవేసేవాడుకాదు. ఒకవేళ జారవేసినా రేటు ఎక్కువగా ఉండేది.

వాగుదారి పూర్తిగా మారిపోయింది. ఎత్తు పల్లాలు లేకుండా మొరం పోశారు. తొవ్వను కాస్త వెడల్పు చేశారు. వాగులోకి దిగాక సాయిలు ఆశ నిరాశగా మారింది. వాగు ముందటిలా లేదు. కాజ్ వేశారు. ట్రాక్టర్లు, బండ్లు సులువుగా వెళ్లవచ్చు. వాగులో మోటార్లు, లిఫ్ట్ పైపులు వేసి పునాస భూముల్ని ఆయకట్టు వేశారు.

కాజ్‌వే మీదుగా నీరసంగా అవతలిగట్టుకు చేరుకున్నాడు సాయిలు. చింతచెట్లు, మామిడితోట, బీడు చెలక, తంగేడిచెట్లు అన్నీ మాయమైపోయాయి. ఆ ప్రదేశమంతా కరంటు మోటార్లతో సాగుచేశారు. ఆ మార్పుకు సంతోషించాలో, తియ్యనిపండ్లు చల్లని నీడను ఇచ్చే తోటలు కనుమరుగైనందుకు బాధపడాలో తోచలేదు. నీరసంగా అడుగులు వేస్తున్న అతడికి, ''సాయిలూ... ఓరి సాయిలూ...'' అన్న పిలుపు వినిపించి తిరిగి చూశాడు.

కానుగుచెట్ల నీడన కూర్చుని ఎవరో పిలుస్తున్నారు. అక్కడ వడ్లరాశి కూడా కనిపించింది. ఎప్పటికప్పుడు ఆశ చివురిస్తూనే ఉందతనిలో. కనీసం ఈ కల్లమైనా దొరికితే బావుంటుందని అటువైపు నడిచాడు.

''ఏందిరా సాయిలూ! ఏర్పటు జేస్తలెవ్వా... ఈ చెల్కను పోయిన యాడాదే కొన్న. ఐదెకురాలు అచ్చుకట్టి రెండు మోటార్లు పెట్టిన. నువ్వేందిరా కట్టెపుల్ల లెక్క

అయినవు. మా ఊరికి వచ్చుడే బందుజేసినవు,'' కల్లు లొట్టిని పక్కకు జరుపుతూ అన్నాడు భూమయ్య సాయిలు కొంత దూరంలో ఉండగానే.

పిలిచింది భూమయ్య అని తెలియగానే సాయిలు కాళ్లు ఆగిపోయాయి. వెళ్లాలా వద్దా అని కొన్ని క్షణాలు ఆలోచించి, వెళ్లపోతే బావుండదని కానుగు చెట్ల నీడకు వెళ్లాడు సాయిలు. అతడిని చూడగానే భూమయ్య భార్య తల దించుకుంది. కొడుకు సాయిలును నవ్వుతూ పలకరించాడు. కోడలు మౌనం గా ఉండిపోయింది.

''ఏంటిది భూమన్నా... దావతు చేసుకుం టుంన్రా? ఈల్లెవలు... కోడలు పొల్లనా?'' వారికి దూరం గా కూర్చుంటూ అన్నాడు సాయిలు.

''అవున్రా పోయినేడు లగ్గం జేసిన. వాళ్ల కట్నం పైసల్తోనే ఈ చెలుక కొని అచ్చు కట్టిన,'' అంటూ కల్లు కుండతో లేచి సాయిలుకు ఒక సాక వంచాడు. ఆకలిగా ఉండడంతో వద్దనలేదు సాయిలు. ఒక దమ్ముపట్టి ఆకును కింద పడేస్తూ ఓరగా భూమయ్య భార్య వైపు చూశాడు. ఆమె దించిన తల ఎత్తడంలేదు. సాయిలుకు నాలుగేళ్ల క్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

ఆరోజు రాత్రి పొద్దుపోయేవరకు వెంకటరెడ్డి వడ్లను గాడిదల మీద చేరవేశాడు సాయిలు. చివరి ములుకకు గొంగడిని కల్లం వద్దనే మరిచివచ్చాడు. గొంగడి తెచ్చుకుందామని టార్చ్‌లైట్ పట్టుకుని వెంకట రెడ్డి కల్లం వద్దకు వెళ్లాడు సాయిలు. అక్కడ గుడ్డి కుప్పలు చాటున ఏదో గుసగుసలు వినిపించాయి. అనుమానం వచ్చి టార్చ్‌లైట్‌ను అటువైపు ఫోకస్ చేసాడు. గడ్డికుప్ప చాటున భూమయ్య భార్య, వెంకట రెడ్డి కనిపించారు. అలికిడికి వెంకటరెడ్డి పారిపోయాడు. ఆమె సాయిలు కాళ్లపై పడి ఎవరికీ చెప్పవద్దని బతిమా లింది. ఆనాటి నుండి మళ్లీ కనిపించలేదు ఆమె.

''కల్లం లేచిందని కల్లు తెప్పిచ్చిన. పొలిజేద్దా మనుకున్నంగని మా పాలివాడు చచ్చిపోయి ముట్టు డచ్చింది. గందుకనే బందువెట్టిన. ఎండపూట దూప దూప ఉంటదని తాగుతున్నం,'' గ్లాసుల్లో కొడుక్కు, కోడలుకు కల్లుపోసి అందిస్తూ అన్నాడు భూమయ్య.

''వడ్లు ఎట్ల జారగొడుతున్నవు భూమన్నా! ట్రాక్టరు మీదనే జారగొడుతున్నవా...?'' అడిగాడు సాయిలు.

''ఇంతకుముందు గట్లనే అనుకన్న. ఇప్పుడు నువు వచ్చినవు గదా! గాడుదల మీద జారగొట్టు. ట్రాక్టర్‌కు చెప్పినగనీ వస్తే వద్దని చెప్పుతా. వడ్లను ఇప్పుడు అమ్మ. అయిటు ముంగట మంచి ధర వుంటది గదా! అప్పుడు అమ్ముత...''

భూమయ్య మాటలు పూర్తికాకముందే అందు కుంది అతడి భార్య. ''ముందుగల్ల అటు మాట ఇస్తిమి. ఇప్పుడు వద్దంటే ఏమంటరు. మాటపోతది. మల్ల ఈసారి రమ్మన్నా రారు.''

ఆమెకు ఇష్టంలేదని గ్రహించాడు సాయిలు. చూస్తూ చూస్తూ అంత పెద్ద కల్లాన్ని వదిలిపెట్టడం ఇష్టంలేదు. అందుకే మెల్లిగా అన్నాడు. ''అయితే ఏందీ...? ట్రాక్టరోనికి మస్తు గిరాకీ ఉంది. వాడు వచ్చే సరికి ఏ యాల్ల అయితదో! మీకు చెప్పబుద్ధి గాకపోతే నేను చెప్పత తియ్యి.''

భూమయ్య భార్య మౌనంగా ఉండిపోయింది. భార్యకు సర్ది చెప్పి సాయిలును, గాడుదలను తోలుకొని రమ్మని చెప్పాడు, భూమయ్య. అతడి కొడుకు కూడా గాడుదులు వద్దని చెప్పాడు.

''ఏదో గరీబుగాడు, బతుకని తియ్యి. భూమి తల్లి ఎత్తుకుని పంట పండితె బతుకు తంగని ఒకరికి దానం చేస్తే పోతరా!'' అని కొడుక్కు సర్ది చెప్పాడు.

ఆనందంగా కొట్టంవైపు మళ్లాడు సాయిలు. అతడి అడుగులు వడివడిగా పడుతున్నాయి. కాళ్లలో కొత్త శక్తి వచ్చి చేరింది. కొట్టంకు కొద్దిదూరంలో ఉండ గానే వినిపించే గాడిదల అరుపులు వినిపించలేదు. నడుస్తున్న సాయిలు హృదయంలో గుబులు మొదల యింది. గాడిదల అరుపులు ఎందుకు వినిపించటం లేదో అర్థం కాలేదు. గాడిదలు ఏమైనట్టు...? ఆలోచిస్తూ పరుగులాంటి నడకతో కొట్టంను చేరుకున్నాడు.

గాడిదలు కనిపించలేదు గానీ కుమ్మరి నర్సయ్య మీసం మెలివేస్తూ కనిపించాడు. సాయిలును బండ బూతులు తిట్టాడు. ఎవనవ్వ జాగిరని తోలినవని గర్జిం చాడు. సాయిలు కాళ్లావేళ్లాపడి బ్రతిమాలాడు. నర్సయ్య ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. ఊసూరు మంటూ లేచి గాడిదల వెదుకులాటలో పడ్డాడు సాయిలు. అసలే కల్లాల దినం. పొలాలల్లో గాడిదలు పడితే వాటిని తరుముతారు రైతులు. అలా ఊరి పొలి మెర దాటాయంటే దొరకడం కష్టం. అసలే అవి కొత్తవి.

సాయిలు గుండె దడదడలాడింది. కాళ్లీడ్చు కుంటూ నడుస్తున్నాడు. కనుచూపుమేరలో గాడిదలు కనిపించడం లేదు. ఒక్క గాడిద తప్పిపోయినా వేలల్లో ఖరీదు చెల్లించాలి. ఇప్పుడు కిరాయికాదు... తన

గాడిదలు తనకు దొరికితే చాలని కోరుకుంటున్నాడు. తెలిసిన వారిని వాకబు చేస్తూ వారు చెప్పినవైపు వెళు తున్నాడు. గాడిదల్లో ఏ రెండు మూడు తప్పిపోయినా తాను ఇంటికి వెళ్లడం కంటే ఏ చెట్టుకో ఉరివేసు కోవడం మంచిదన్న నిర్ణయానికి వచ్చాడు. ఇంతకు ముందు ఇలాగే రెండు గాడిదలు తప్పిపోయాయి. వాటి కొరకు ఊళ్లన్నీ తిరిగాడు. గ్రామ పంచాయతీల్లో కలిశాడు. బందెల దొడ్లన్నీ వెదికాడు. ఎక్కడా జాడపడ లేదు. తిరగడానికే వేయి రూపాయలు ఖర్చయ్యాయి. అవి తన స్వంతం కాబట్టి నాలుగురోజులు బాధపడి మర్చిపోయాడు. ఇప్పుడు పరాయివాడి గాడిదలు తప్పి పోయాయని తెలిస్తే ఖరీదు ఎక్కువంటారు.

పొలాలు దాటి ఎర్రచెల్కలోకి వచ్చాడు సాయిలు. పొద్దు వంగినా ఎండ తీవ్రత వంగలేదు. గాలిలేక దగ ఎక్కువైంది. వేడిసెగలు కక్కుతూ అప్పుడప్పుడు వడ గాలి వీస్తుంది. సాయిలుకు దుఃఖం ముంచుకొస్తుంది. కళ్లకు చీకట్లు కమ్ముతున్నాయి. సత్తువనంతా కూడగట్టు కుని నడుస్తున్నాడు. రెండుగంటల వెదుకులాట తర్వాత పదిహేడు గాడిదలు దొరికాయి. ఇంకా మూడింటి జాడ కనిపించలేదు.

దొరికిన గాడిదల్ని ఎక్కడ ఉంచాలో, తప్పి పోయిన వాటిని ఎక్కడ వెదకాలో తోచలేదు. తప్పి పోయినవాటిని చూస్తుంటే మిగిలినవి తప్పిపోయేట్టు న్నాయి. తుమ్మపొరుక, నర్రెంగ పబ్బులు ఏరి గాడిదల న్నింటిని ఒకచోట చేర్చి చుట్టూ కంచె వేశాడు. దాహంతో నోరెండుకుపోయింది. ఆకలితో కడుపు మాడిపోతుంది. చెమటలతో గొంగడి తడిసిపోతుంది. ఇవేవీ లెక్క చేయ కుండా వెదుకులాటలో పడ్డాడు సాయిలు.

చీకట్లు ముసురుకుంటున్నాయి. పొలాల నుండి జనం ఇంటి మొహం పడుతున్నారు. ఆగమాగంగా తిరుగుతున్న సాయిలును, 'ఏం జరిగిందని,' ప్రశ్నిస్తు న్నారు. కొందరు జాలిని చూపుతున్నారు. మరికొందరు నిర్లిప్తంగా వెళ్లిపోతున్నారు. మసక వెన్నెల వెలుతురులో సాయిలు వెదుకుతూనే ఉన్నాడు.

చాలాసేపటి తర్వాత అతడి కష్టం ఫలించింది. ఇటుకబట్టీ బూడిదలో దొర్లుతూ కనిపించాయి గాడిదలు. ప్రపంచాన్ని జయించినంత తృప్తి, ఆనందం కలిగింది సాయిలుకు. వాటిని ప్రేమగా నిమిరి మిగతా గాడిదులతో కలిపి కూరుకు రాత్రి దాటుతుండగా నర్సయ్య కొట్టం వద్దకు వచ్చాడు. అది తప్ప వేరే కొట్టం లేదు.

గాడిదల్ని కొట్టంలో తోలి నర్సయ్య ఇంటికి వెళ్లాడు సాయిలు. కాళ్లు కడుపు పట్టుకుని బ్రతిమా లాడు. ఆయన వడ్లను కిరాయి లేకుండా జారవేస్తానని చెప్పాడు. మొదట బెట్టు చేసినా చివరికి ఒప్పుకున్నాడు. నర్సయ్య కల్లంలో వడ్లున్నాయని తెల్లారగానే గాడిదల్ని తోలుకుని రావాలని గట్టిగా చెప్పారు. తల ఊపి బయటకొచ్చి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు సాయిలు. ముందుకు గంగమణి ఇంటికి వెళ్లి భోజనం చేశాడు. వడ్లను రేపు జారవేస్తానని చెప్పడానికి భూమయ్య ఇంటికి వెళ్లాడు.

ఇంటి ముందు ట్రాక్టరు కనిపించింది. వడ్ల సంచుల్ని దించుతన్నారు. సాయిలుకు నీరసం కమ్ము కుంది. భూమయ్య తనను తిడుతూ సంచుల్ను దించు తున్నాడు. తనని తప్పుపడుతున్నారని గ్రహించాడు సాయిలు. వారితో ఏమని మొరపెట్టుకున్నా లాభం లేదని వెనక్కి తిరిగాడు. కొట్టం వద్దకు వెళ్లి గొంగడి పరుచుకుని పడుకున్నాడు.

నిద్ర రావడం లేదు. అటూ ఇటూ దొర్లు తున్నాడు. గాడిదలు అప్పుడప్పుడూ ఓండ్రు పెడు తున్నాయి. సాయిలుకు ఇల్లు, ఊరు గుర్తొచ్చాయి. భార్య ధాన్యంతో వస్తానని ఎదురుచూస్తుంది. అప్పులు కాకపోయినా తిండిగింజలకైనా లోటు లేకుండా నడు స్తుందనుకొంటుంది. ఉత్త చేతులతో తిరిగి వెళ్తే బెంగ టిల్లదా...? గాడిదలిచ్చిన వారికి ఏమని బదులు చెప్పాలి...? ఆలోచిస్తూ పడుకున్నాడు సాయిలు. ఏ అర్థ రాత్రికో నిద్రపట్టింది. నిద్రలో కమ్మని కల. రైతు లందరూ తన రాక కొరకు ఎదురుచూస్తున్నట్టు... తను వడ్లను జారవేస్తున్నట్టూ... తెల్లవారకముందే మెలకువ వచ్చింది. మళ్లీ ఆలోచనలు చుట్టుముట్టి భయ పెట్టాయి.

లేచి వేపపుల్ల నోట్లో వేసుకుని గాడిదలతో నర్సయ్య కల్లం వద్దకు చేరుకున్నాడు సాయిలు. అప్పటికే కొలత బుడ్డీని రెడీ చేసుకున్నాడు నర్సయ్య. చేటతో వడ్లను ఎత్తి బుడ్డిలో పోస్తూ బుడ్డీ నిండగానే సంచిని పట్టుకున్నాడు సాయిలు. నర్సయ్య బుడ్డీని ఎత్తి సంచిలో పోసి మళ్లీ బుడ్డి మీద కూర్చుంటున్నాడు.

అలవాటు తప్పిన పని. బరువుకు ఎత్తినప్పుడు పేగులు గుర్రుమంటున్నాయి. ఇద్దము వడ్లు కాగానే సంచి మూతి కట్టుకట్టి అమాంతం ఎత్తి గాడిద మీద వేస్తున్నాడు సాయిలు. అలా ఎత్తినప్పుడు పక్క ఎముకల్లో నొప్పి వస్తుంది. వీటిని లెక్క చేయకుండా పని చేస్తున్నాడు సాయిలు.

ఆరోజు కూడా గిరాకీ రాలేదు. అప్పటికీ ఇప్పటికీ రైతుల్లో ఎంతో మార్పును గమనించాడు సాయిలు. పొద్దు పొడుస్తూనే చేన్లల్లో వాలి కూరుకు రాత్రి వరకూ పనిచేసే రైతులు కరువైపోయారు. ఏడెనిమిది దాటాక రెండుమూడు సార్లు టీ తాగి గానీ పొలాలలకు రావడం లేదు. టైం ప్రకారం పని. పొద్దుగూకిందంటే ఇంటికి చేరుకుంటున్నారు. ఇళ్లల్లో టీవీలు, వాటికి కేబుల్ కనెక్షన్‌లు వచ్చాయి. ముందటిలా ఎడ్లదొడ్లకాడ కూరుకు రాత్రి వరకు ముచ్చటలు లేవు.

ఈరోజు కాకపోయినా రేపైనా దొరుకుతుందన్న ఆశతో సాయిలు రెండు రోజులు గడిపాడు. ఒకటి రెండు తప్ప కిరాయిలు రాలేదు. అవి కూడా సగం రేటుకే. ఒప్పుకోక తప్పలేదు సాయిలుకు.

మూడవనాడు మల్లారెడ్డిని కలిశాడు సాయిలు. అతడిని చూడగానే ఏడ్చినంతపని చేసాడు. సాయిలును ఓదారుస్తూ చెప్పాడు మల్లారెడ్డి. "ఊరంతా మూడు ట్రాక్టర్లున్నాయి. పవర్ టిల్లర్‌లున్నాయి. ఒక కోత మిషన్ కూడా ఉంది. అవి ప్రాణం లేని యంత్రాలు. వాటితో నువ్వు పోటీ పడలేవురా. ఇక్కడ ఉండడం కంటే నువ్వు వెళ్లిపోవడమే మంచిది."

ఆశ చావక మరో రెండు రోజులు వేచి చూశాడు సాయిలు. ఒక్క పురుగు కూడా రాలేదు. అర్ధరాత్రి నిద్రలేచి గాడుదులతో బయల్దేరాడు. మొట్టమొదటి సారిగా ఆ ఊరి నుండి ఖాళీ సంచులతో వెళ్తున్నాడు సాయిలు. పొద్దు పొడుస్తుండగా తన ఊరికి చేరుకున్నాడు. ఖాళీ సంచులతో. మధ్యలోనే తిరిగి వచ్చిన భర్తను చూసి కంగారుపడింది బాలవ్వ.

"ఏంటది...? మల్లా కడుపునొప్పి గిట్ల లేచిందా! ఓయవ్వో... నా నోట్లె ఇక మన్నే. మల్ల ఆపరేషనంటే యాడ బోవాలె... కూడు లేకనే సచ్చుడు గావట్టె. వేలకు వేలు యాడికెళ్లి దెత్తను," ఏడుస్తూ అన్నది.

సాయిలు విరక్తిగా నవ్వి అరుగు అంచుపై కూలబడి అన్నాడు. "అట్లయినా బాగుండేదే! మనం గాక పోయినా మరొకరైనా బతుకుదురు. ఇప్పుడు ఆ ఊరి మీద కూలీవాడు కూడా బతుకడే ! యంత్ర భూతా లచ్చినయ్"

బాలవ్వకు అర్థంకాలేదు. వివరంగా అర్థమయ్యేట్టు చెప్పాడు సాయిలు. బాలవ్వ ఏడుపును అందుకుంది. ట్రాక్టర్లను, అవి కొన్నవారిని శాపనార్థాలు పెట్టింది. ఆమె మనసు మనసులో లేదు. గంపెడాశతో భర్తను సాగనంపింది. డబ్బు, ధాన్యం తెస్తాడనుకుంది. ఖాళీగా తిరిగి రావటం జీర్ణించుకోలేకపోతుంది.

"నువ్వు పోయినంక అప్పులోల్లు పల్లెత్తుమాట అనలేదు. సేటు కావలసినంత సరుకు తీసుకపొమ్మన్నడు. తెచ్చిన వడ్లను తనకే యిమ్మన్నాడు. బతుకుల మన్నువడ, దిక్కుమల్లె బతుకు. ఇప్పుడెట్ల... ఏం జెయ్యాలె! ఎట్ల బతుకుదాం... పోరగాండ్ల కింత ఇస మిచ్చి సంపుత. నేనింత ఇసం దాగుత. ఎక్కడ జూసిన ఏం ఆధారం లేదు. నువ్వు వచ్చినవని తెలిస్తే అప్పులోల్లు కుక్కల లెక్క ఉరికచ్చి సిగ్గుదీత్తరు. పాణంల మన్నువడ. మానం పోయినంక పాణం ఉండుడెందుకు," విరక్తిగా అన్నది బాలవ్వ.

కొన్ని క్షణాలు ఆలోచించి భార్యవైపు నవ్వుతూ చూశాడు సాయిలు. "పిచ్చిదానా- పిరికివాళ్లు సచ్చిపోతరు. ధైర్యవంతుడు కట్టాలు వచ్చినప్పుడు ఎదురుగ నిలబడుతడు. కాలం మారింది, మనం మారాలె! అంతే గనీ ఇసం దాగుత మన్ను తాగుత అని బెదిరిపోతరా- ఈ పని గాకపోతే ఇంకోపని, కాళ్లు జేతులు సల్లగుండాలె గానీ పనికేం తక్కువ. మస్తు పనులున్నాయి. ఆరు నెలల్లో టాక్టరు నడుపుడు నేర్చుకుంట. మల్ల పంటల వరకు అదే ఊరుకు వెళ్త. ఎవరి టాక్టర్ మీదన్న జీత ముండి మిమ్ముల్ని సాదుత," దృఢంగా చెబుతూ ఇంట్లోకి నడిచాడు సాయిలు.

బాలవ్వ తనను తాను మరిచి అతడివైపు విచిత్రంగా చూసింది. ఆమె కళ్లల్లో ఆశ్చర్యం, అంతకు మించి ఆనందం ఉన్నది.

*సుప్రభాతం ఉగాది ప్రత్యేక సంచిక, 2006*

